బీఆర్‌ఎస్ హయాంలోనే నగరం అభివృద్ధి

పద్మారావు గౌడ్



పద్మారావునగర్ పార్కులో వాకర్స్‌తో పద్మారావు

పద్మారావునగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నగరంలో ఎంతో అభివృద్ధి చెందిందని అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఎన్నికల్లో ఆశీర్వదించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పార్కులో వాకర్స్‌తో ముచ్చటించారు. నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దిన ఘనత నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. సికింద్రాబాద్ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తా ఓటుతో తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్ గౌడ్, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మారావును ఎంపీగా గెలిపించుకుందాం



మాట్లాడుతున్న సామల హేమ

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావును గెలిపించుకోవడం ద్వారా ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతోందని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. ఆదివారం సీతాఫల్‌మండి డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పద్మారావుగౌడ్ రెండు మార్లు రాష్ట్ర కేబినెట్ హోదాలో ఉండి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. కేంద్ర కేబినెట్ మంత్రిగా ఐదేళ్లు కొనసాగిన బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన పద్మారావుగౌడ్‌ను ఎంపీగా గెలిపించుకోవడంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

అమ్మానాన్న దీవించండి..



కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో భాగంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఆదివారం బొల్లారం శ్మశానవాటికలో బీజేపీ అభ్యర్థి టీఎన్. వంశ తిలక్ ఆయన తల్లిదండ్రుల సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట అజిత్ కళ్యాణ్, శ్రీకిషన్, బీజేపీ నాయకులు ధన్‌రాజ్, భరత్ ఉన్నారు. రసూల్‌పురా

విజయానికి ఆశీర్వదించండి



బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత సైతం తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. ఆదివారం ఆమె నియోజకవర్గంలోని ప్రధాన చర్చిలలో క్రైస్తవులను కలిసి మద్దతివ్వాలని కోరారు. అనంతరం ఏడో వార్డు తిరుమలగిరిలోని లాల్‌బజార్ సిఎస్‌ఐ గ్యారిసన్ వెస్లీ చర్చ్, గ్రేస్‌ఫుల్ గాస్పల్ చర్చిలను సందర్శించి తన విజయానికి ప్రార్థన చేయాలని కోరగా పాస్టర్లు ప్రార్థనలు చేసి ఆమెను ఆశీర్వదించారు. ఆమె వెంట రెవరెండ్ జోసెఫ్, పాస్టర్ స్టువర్ట్ బి. క్లేమేట్ రాజ్, నాయకులు కేబి. శంకర్రావు, చంద్రశేఖర్, రెనాల్డ్, మహేష్ ఉన్నారు. - రసూల్‌పురా

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఔదార్యం

పూర్వ విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



రాంగోపాల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి ప్రస్తుతం బీటెక్ చేస్తున్న పూర్వ విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను బహూకరించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కనకం సాయి ప్రియ గతంలో సికింద్రాబాద్‌లోని కళాసీగూడ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసి ప్రస్తుతం సెయింట్ మేరీస్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ప్రాజెక్టు వర్కులో భాగంగా ఆ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అవసరం కావడంతో ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం నారాయణకు తెలిపింది. దీంతో వెంటనే ఆయన తన బంధువుల సహకారంతో సుమారు రూ.82వేల విలువ చేసే కొత్త ల్యాప్‌టాప్‌ను ఆ విద్యార్థినికి అందించారు. ఉపాధ్యాయుడు ఇలా పూర్తి విద్యార్థిని ఉన్నత విద్యకు సహకరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కార్యకర్తలకు కాంగ్రెస్ ద్వారా మాత్రమే న్యాయం



ఎన్ఎస్‌యూఐ సమావేశంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

సికింద్రాబాద్: పార్టీ శ్రేయస్సు కోసం పాటుపడే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ద్వారా మాత్రమే న్యాయం జరుగుతుందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారు. సీతాఫల్‌మండి సెవెల్‌హిల్స్ హాల్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి దానం నాగేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో కార్యకర్తలుగా, నాయకులుగా పనిచేసిన యువకులను ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా తీర్చిదిద్దిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమ, పలువురు ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు బీసీ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు బాలక్రిష్ణ, రాజశేఖర్, రామారావు, శ్రీకాంత్ యాదవ్, కబీర్‌దాస్, మనోజ్, సామయ్య, అనిల్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని కోరారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందని అదే విధంగా నరేంద్రమోదీ పాలనలో దేశాభివృద్ధి కుంటు పడిందన్నారు.

ఆదరించండి అండగా ఉంటా: నివేదిత



ప్రచారంలో భాగంగా ఆలు చిప్స్ వేయిస్తున్న నివేదిత

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత సాయన్నకు బొల్లారం ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. ఆదివారం రాత్రి బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్ ఆధ్వర్యంలో బొల్లారం రిసాలబజార్, పెన్షన్‌పురా, పయనీర్ బజార్ ఇతర బస్తీల్లో గడపగడపకు వెళ్లిన నివేదిత కారుగుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. 30 ఏళ్ల పాటు తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న ఏ విధంగా ప్రజలకు అండగా ఉన్నారో తాను కూడా అదే విధంగా ప్రజలకు సేవ చేస్తూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. లోక్‌నాథ్ మాట్లాడుతూ.. ప్రజలను మోసగించేలా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు హామీలు ఇస్తున్నారని వారి మాటలను నమ్మరాదన్నారు. ఈ ప్రచారంలో రవికుమార్, వేణుగోపాల్ రెడ్డి, ఇక్బాల్, అనిల్ గౌడ్, వెంకటేష్ యాదవ్, శివ, అమర్, గౌరమ్మ స్నేహా, గీత, ఉదయ్, ఉమేష్, వినయ్, శ్రీకాంత్, సురేష్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మోండా డివిజన్‌లో నివేదిత ప్రచారం

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఉన్న ఆడబిడ్డనైన తనను ఆశీర్వదించాలని నివేదిత ఓటర్లను కోరారు. ఆదివారం ఆమె పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కుమార్తె మౌనిక రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప తదితర సీనియర్ నాయకులతో కలిసి మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. తన తండ్రి సాయన్న, సోదరి లాస్య నందిత పట్ల చూపిన ఆదరాభిమానాలు మరోమారు తనపై చూపించాలని కోరారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజా రంజక పాలనను కేసీఆర్ అందించారని గుర్తు చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు నిరంతరం సేవ చేస్తానని నివేదిత హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో ఆకుల హరికృష్ణ, సుజన్, రామారావు, గౌరిశంకర్, నారాయణ, అనిత, సువర్ణ, మాధురి, భవాని పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ నాయకుల సమావేశం

సనత్‌నగర్: ఈ నెల 22న ఉదయం 9 గంటలకు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసం వద్ద మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రచార సరళిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచార రథాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభిస్తారన్నారు.

రేపు ఉగాది పురస్కారాల ప్రదానం

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న సీనియర్ సిటిజన్స్‌కు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. అక్కినేని నాటక కళా పరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, ప్రముఖ రచయిత్రి ఇనగంటి లావణ్య హాజరవుతారన్నారు.

బీజేపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు

కిషన్‌రెడ్డి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించడం తథ్యమని సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి వారాసీగూడలో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సికింద్రాబాద్‌లో ఓటమి భయంతోనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా ఆయా పార్టీలు ఎమ్మెల్యేలను పోటీలో దింపాయని చెప్పారు. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఎవరైనా సికింద్రాబాద్‌లో భారీ మెజారిటీతో తన విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి, కందాడి నాగేశ్వర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, అంబాల రాజేశ్వర్‌రావు, రాచమల్ల కృష్ణమూర్తి, ప్రభుగుప్తా పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో..

సికింద్రాబాద్: బౌద్ధనగర్‌లో ఆదివారం బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. మేకల సారంగపాణి, నాగేశ్వర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, కనకట్ల హరి, హనుమంతు, సత్యనారాయణ, దత్తు, రఘు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

లాలాపేటలో..

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తార్నాక డివిజన్ లాలాపేటలో ఆదివారం నిర్వహించిన బీజేపీ ఇంటింటికి బొట్టు కార్యక్రమంలో మాజీ మేయర్ బండా కార్తీక రెడ్డి, బీజేపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అనిత, తార్నాక డివిజన్ అధ్యక్షురాలు సత్యవతి పాల్గొన్నారు. మహిళలకు బొట్టు పెడుతూ కమలం గుర్తుకు ఓటేసి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట: మాదిగ, ఉపకులాల ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ నేతృత్వంలో అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్ నుంచి ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రచారంలో భిక్షపతి, వేణుగోపాల్, సుజాత, మహేందర్, శివప్రసాద్, మహేష్, సాయికుమార్, వెంకటేష్, సామ్యుల్, నర్సింహ, రాజు, ప్రకాష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మంచితనం, మానవత్వం అలవర్చుకోవాలి

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని విశ్వ మానవ సంక్షేమ సంఘం 37వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పెరుగుతున్న జనాభా, సమాజంలో పెరుగుతున్న హింస, స్త్రీలపై అత్యాచారాలు, కుల మత ఘర్షణలు, పేద వారిలో పొదుపు ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ, మురికివాడలకు చెందిన చిన్నారులకు ఉచిత ట్యూషన్ సెంటర్లు, చేతబడులు, బాణామతి, మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కలిగించే లక్ష్యంగా విశ్వ మానవ సంక్షేమ సంఘం సేవలను కొనసాగిస్తూ వస్తోంది. జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ విట్టా వెంకట్రామయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు మంచితనం, మానవత్వాన్ని అలవర్చుకోవాలని అప్పుడే దైవం కూడా తోడుగా ఉంటాడన్నారు. సంఘం వ్యవస్థాపకులు మస్తాన్‌రావు పెసల మాట్లాడుతూ.. పిల్లల్లో క్రమశిక్షణ, సమయపాలన, భారతీయ సంస్కృతి, నాగరికత లాంటి అంశాలను వివరిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు విశ్వ మానవ సంక్షేమ సంఘం కృషి చేస్తుందన్నారు. ఉచిత ట్యూషన్ సెంటర్ల ద్వారా పిల్లలు సన్మార్గంలో నడిచేలా ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు పెంచల్ నాయుడు, ముఖ్య కార్యదర్శి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు, ఈసీ సభ్యులు టీఎస్‌పీ ఆంజనేయులు, కేవీ సుబ్బారెడ్డి, పూర్వ అధ్యక్షులు ఆర్.ప్రసాద్‌రావు, చెన్నుపాటి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



లాలాపేట: హనుమాన్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని హిందూ వాహిని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం లాలాపేటలోని శివాలయం ఆవరణలో ఈ నెల 23న లాలాపేటలో నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 8 గంటలకు లాలాపేట ఇసుకబాయి నుంచి తాడ్‌బండ్ ఆంజనేయ దేవాలయం వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

త్వరలో బీఆర్‌ఎస్ ఖాళీ: మైనంపల్లి



మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సతీష్‌గుప్తా దంపతులు

కంటోన్మెంట్: త్వరలోనే కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందని కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం కార్ఖానాలో బీఆర్‌ఎస్ నేత తేలుకుంట సతీష్ గుప్తా ఇంటికి వచ్చిన మైనంపల్లి, ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మైనంపల్లి ఆహ్వానానికి తేలుకుంట సతీష్ ఆమోదం తెలుపడంతో ఆయన సతీమణి అరుణ్‌జ్యోతి, ఇతర ముఖ్య అనుచరులు రవి, మధు ముదిరాజ్, సాహిల్ సింగ్, వర్షిత్, చిట్టి రాజు, మహేశ్, వినోద్, సోను తదితరులను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. అనంతరం మైనంపల్లి మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీగణేశ్ గెలుపు ఖాయమన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో పాటు అన్ని వార్డుల నుంచి కీలక నేతలు, కార్యకర్తలు తమతో కలిసి పనిచేస్తున్నారని త్వరలోనే బీఆర్‌ఎస్ ఖాళీ అవ్వడం ఖాయమన్నారు.

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావుల శ్రీధర్ రెడ్డిని జిల్లా అధ్యక్షుడు తన్ని తరిమితే కంటోన్మెంట్‌కు వచ్చి పడ్డాడని ఎద్దేవా చేశారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఆయన, ఇతరులను జంపింగ్‌లు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీగణేశ్, జంపన ప్రతాప్, రేపాల వెంకటేశ్వర్లు, రంగ రవీందర్ గుప్తా, ఆనంద్ బాబు, బాబూరావు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు గుర్తింపు లేదు..

కంటోన్మెంట్: ఉద్యమ ద్రోహులు బీఆర్‌ఎస్‌లో చేరి కేసీఆర్ విధి, విధానాలను సైతం తప్పుదోవ పట్టించారని కంటోన్మెంట్ సీనియర్ ఉద్యమకారుడు ప్రభుగుప్తా ఆరోపించారు. కంటోన్మెంట్‌లో తెలంగాణ ఉద్యమకాలం నుంచీ పార్టీని అంటిపెట్టుకుని అనేక పోరాటాలు చేసిన తమలాంటి నేతలను, బీఆర్‌ఎస్‌లోని వలసవాదులు అణగదొక్కుతున్నారని అన్నారు. ఆదివారం మైనంపల్లి హన్మంతరావు, కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 35, పందిరి బీర 50, క్యాబేజీ 23, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 80, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.


బుర్రకథ కళను పరిరక్షించాలి



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

లాలాపేట: ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బుర్రకథ సామ్రాట్‌గా ప్రసిద్ధి చెందిన గొప్ప కళాకారుడు రత్నం అని పలువురు కొనియాడారు. ఆదివారం తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్‌లో బుర్రకథ సామ్రాట్ బి. రత్నం 7వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రత్నం చిత్రపటానికి పలువురు నాయకులు, కళాకారులు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. గీతాలు ఆలపించారు. అంతరించిపోతున్న బుర్రకథ కళను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆసక్తి కల్గిన వారికి బుర్రకథలో శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు సైతం బుర్ర కథ కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది కళాకారులను శాలువాతో, మెమొంటోతో నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత మాస్టార్జీ, బి.యాదగిరి, బి. కిషన్ తదితరులున్నారు.

నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నాగేశ్వర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగం నుంచి జిల్లపల్లి నాగేశ్వర్‌రావు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సీనియర్ అధ్యాపకులు ప్రొ.వీబీ నరసింహ పర్యవేక్షణలో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ డీప్ లెర్నింగ్ అండ్ కంప్రెషన్ టెక్నిక్స్ ఆన్ హెల్త్ కేర్ సిస్టం ఫర్ ఇంప్రూవ్ డేటా స్టోరేజ్ ఎఫీషియన్సీ అనే అంశం పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

'బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం'



బీఆర్‌ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం రెండవ వార్డుకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎన్నికల ఇంచార్జి రావుల శ్రీధర్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు చేస్తోందని తెలుసుకున్న ఆ పార్టీ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. మైనార్టీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని కంటోన్మెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తుందని రావుల శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్, షేక్ మహమ్మద్, దావూద్‌ఖాన్ ఆసిఫ్, అక్రమ్, మహ్మద్ జాఫర్, మహమ్మద్ సిరాజ్, మహ్మద్ సలీం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో గుర్తింపు లేదు



మాట్లాడుతున్న ముప్పిడి మధుకర్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్‌ఎస్‌లో సాయన్న అనుచరులకు తగిన గుర్తింపు దక్కకపోవడంతోనే పార్టీ వీడుతున్నారని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సాయన్న ప్రధాన అనుచరుడు ముప్పిడి మధుకర్ అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాను పాతికేళ్లుగా సాయన్న అనుచరుడిగా కొనసాగానని ఆయన మరణించాక, కుమార్తె లాస్య నందితను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడంలోనూ శక్తివంచన లేకుండా పని చేశానన్నారు. అయితే ఆమె ఎమ్మెల్యేగా గెలిచాక కీలక నేతలకు తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. సాయన్నపై అభిమానం ఉన్నప్పటికీ, ఆత్మాభిమానం చంపుకోలేక పార్టీ వీడాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్ ముదిరాజ్, భాస్కర్, సతీష్, సిద్దు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి 'కూన' బ్రదర్స్?



సనత్‌నగర్: సీనియర్ నేత కూన వెంకటేష్‌గౌడ్ తనయులు శ్రావణ్‌కుమార్‌గౌడ్, గౌరీశంకర్‌గౌడ్ నేడో రేపో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యంత సన్నిహితుడు వేం నరేందర్‌రెడ్డిని కలిశారు. నేడో, రేపో ముఖ్యమంత్రి సమక్షంలో ఇరువురు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. తన తండ్రి కూన వెంకటేష్‌గౌడ్ మార్గదర్శకత్వంలో ఆయన ఆశయాలను నెరవేర్చేలా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోనున్నట్లు ఈ సందర్భంగా కూన బ్రదర్స్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్పీ డెబస్మిత ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి తన రెండు బ్యాగులో వివిధ బ్రాండ్‌లకు చెందిన సుమారు రూ. 48 వేల విలువ గల మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నాలుగు నెలల్లో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ. 48.26 లక్షల విలువ గల మద్యం బాటిళ్లు, టొబాకో పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.